క్లుప్తంగా

ఉపాధి కల్పనే లక్ష్యం

కపిలేశ్వరపురం: జాతీయ **ఉపాధి హామీ** పథకం ద్వారా గ్రామాల్లోని **కూలీలకు ఉపాధి** కల్పించడమే లక్ష్యంగా కృషి **చేస్తున్నట్టు** మండల సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ **ఇ.కనకారావు,** ఉపాధి హామీ పథకం ఏపీవో **రవి కిరణ్** అన్నారు. మండలంలోని **అద్దంకివారిలంక,** వల్లూరు, వడ్లమూరు, కాలేరు **గ్రామాల్లో శుక్ర**వారం ఉపాధి గ్రామ సభలు **నిర్వహించారు.** మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక నేపథ్యంలో గ్రామాల్లో ముందస్తుగా గ్రామ సభలు చేపట్టామని కనకారావు తెలిపారు. ఆయా గ్రామాల్లో సర్పంచులు నాతి గరవయ్య, దాసి మీనాకుమారి, చుండ్రు మంగాయమ్మ, దాయం కావేరి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభల్లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి పనుల నివేదికను డీఆర్పీ డి.కృష్ణమూర్తి వెల్లడించారు. కార్యక్రమంలో కార్యదర్శులు కె.యశ్వంత్‌కుమార్, కె.సత్తిబాబు, పి.వెంకటేశ్వర్లు, యు.సుప్రియ, జేఈ పి.రంజిత్ సింగ్, టెక్నికల్ అసిస్టెంట్ జె.లోవరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.రమాదేవి, రాణి చాందిని, గోపి, కె.క్రాంతి కుమార్, ఉపాధి మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

పెనుగొండకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుపై హర్షం

మండపేట: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించడంపై అరసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం సంఘ గౌరవా ధ్యక్షుడు డాక్టర్ చల్లా రవికుమార్, అధ్యక్షుడు గండి స్వామిప్రసాద్ శుక్రవారం మండపేటలో మీడియాతో మాట్లాడారు. తన రచనా వ్యాసంగంతో అర్ధ శతాబ్ద కాలంగా తెలుగు భాషను, సాహిత్యాన్ని పెనుగొండ సుసంపన్నం చేశారన్నారు. అభ్యుదయ సాహిత్య వికాసానికి ఆయన కృషి ఎనలేనిదని కొనియాడారు. పెనుగొండ రచనలు 'విదిత', 'అనేక', 'రేపటిలోకి' వంటివి నిరంతరం తపించే శ్రామిక వర్గ పక్షపాతాన్ని చూపుతాయన్నారు. అరసం జిల్లా శాఖ ఉపాధ్యక్షులు మాడా రాము, నేరేడుమిల్లి అబ్బులు కార్యదర్శులు గిడ్డి ప్రకాశం, రాయుడు త్రినాథరావులు హర్షం వ్యక్తం చేశారు.

సంపూర్ణ పారిశుధ్యానికి సహకరించాలి

కాజులూరు: సంపూర్ణ పారిశుధ్యానికి ప్రజలు సహకరించాలని గొల్లపాలెం పంచాయతీ కార్యదర్శి కె.రవి అన్నారు. పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం గ్రామ వీధుల్లో ట్యాంకర్ల ద్వారా హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ వర్షాలు కురుస్తున్నందున గ్రామంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు సత్కారం



ల్యాబ్ టెక్నీషియన్ మాణిక్యాంబను సత్కరిస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ పసుపులేటి మాణిక్యాంబను ఎంపీపీ, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ అంబటి భవాని ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భవాని మాట్లాడుతూ ఇటీవల ఉత్తమ అవార్డు జిల్లాలో ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లకు మాత్రమే రాగా, అందులో మన మండలానికి చెందిన మాణిక్యాంబ ఉండటం గర్వకారణం అన్నారు. ఆమె అందించిన సేవలను కొనియాడారు. వైఎస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి మాట్లాడుతూ కరోనా సమయంలో అందరూ ప్రాణాలను ఎలా కాపాడుకోవాలా అని భయపడిపోతున్న సమయంలో చంటి బిడ్డతో ఉన్న మాణిక్యాంబ ప్రజలకు అందించిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు యెన్నం దేవి, ఇంత కనకదుర్గ, అల్లం నాగసంధ్య, మంచెం దేవి, సర్పంచ్‌లు అంబటి తుకారం, అనిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

క్విజ్ పోటీల విజేత గౌతమి మున్సిపల్ హైస్కూల్

మండపేట: క్విజ్ పోటీల్లో స్థానిక గౌతమి మున్సిపల్ హైస్కూల్ 9, 10 తరగతుల విద్యార్థినులు సత్తా చాటారు. రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాస్థాయిలో రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో ఈ పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రభుత్వ పాఠశాలల నుంచి 300 విద్యార్థినీ,విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. స్థానిక గౌతమి మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినులు దీక్షిత, గీతశ్రీలు తమ ప్రతిభా పాటవాలతో ప్రథమస్థానం సాధించారు. వారికి నిర్వాహకులు రూ.42 వేల విలువైన 10 లాప్‌టాప్‌లు, ఆరు సామ్‌సంగ్ ట్యాబ్‌లను బహూకరించారు. ఇదే పాఠశాల విద్యార్థిని వుంగరాల విశిష్ట నాగసాయి ప్రజ్ఞ 2024 కౌశల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ంది. ఈ విద్యార్థినులకు పాఠశాల ఉపాధ్యాయుడు రామచంద్రారెడ్డి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ జరిగిన ఎనిమిది క్విజ్ పోటీల్లోనూ తమ పాఠశాల విద్యార్థులే ఫైనల్స్‌లో విజేతలుగా నిలిచారన్నారు. కాగా విజేతలను మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి సూర్యలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలిచిన నేత..

- ప్రజాక్షేత్రంలో తిరిగి.. పేదల మనిషిగా ఎదిగి..
- సామాన్యుల పక్షాన సమర్థంగా పాలించిన నేత
- నేడు వైఎస్ జగన్ పుట్టిన రోజు



2010లో ఓదార్పు యాత్రలో వల్లూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)



2018 జూలై 8న రామచంద్రపురం నియోజకవర్గంలో సమస్య వింటున్న వైఎస్ జగన్ (ఫైల్)

కపిలేశ్వరపురం: నాయకుడంటే ప్రజల పక్షాన నిలవాలి. ప్రజా క్షేత్రంలో సామాన్యులతో అడుగు వేయాలి. పేదలు చెప్పిన ప్రతి సమస్యనూ గుర్తుపెట్టుకోవాలి. తన రాజకీయ విధానంలో ప్రజల సమస్యలు పొందుపరుచుకోవాలి. అధికారం దక్కితే తొలి రోజే పేదలకు మేలు చేసే నిర్ణయాన్ని ప్రకటించాలి. మాటలకే పరిమితం కాకుండా పాలనా కాలమంతా పేదల కోసమే పని చేయాలి. చేసిన మంచిని ఆలోచించుకోమని ప్రజలను కోరాలి. ప్రలోభాలకు లొంగి జనం ప్రతికూల నిర్ణయం తీసుకున్నప్పటికీ ప్రతిపక్షంగా మళ్లీ ప్రజలకోసమే నిలబడాలి. పాలక పక్షం మెడలు వంచి ప్రజల సమస్యలపై పోరాడాలి. అచ్చంగా రాష్ట్రంలో అదే జరుగుతోంది. ఐదేళ్ల వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను చూసిన ప్రజలు ఆరు నెలల ప్రజా వ్యతిరేక పాలనను చూస్తున్నారు. ప్రజా క్షేత్రంలోకి దిగిన నాటి నుంచి నేటి వరకూ వైఎస్ జగన్ ప్రజల పక్షాన నిలిచిన తీరును సమీక్షించుకుంటునారు. శనివారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ కథనం.

రెండు నియోజకవర్గాలతో అనుబంధం

సామాన్యుడి గుండెల్లో నిలవడంలో తండ్రి వైఎస్సార్‌కు మించిన నేతగా వైఎస్ జగన్ ప్రజలకు దగ్గరయ్యారు. వారిద్దరికీ మండపేట నియోజకవర్గంతో పెనవేసుకున్న అనుబంధం ఉంది. వైఎస్సార్ పాదయాత్ర, వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్రలు మండపేట నియోజకవర్గం మీదుగా సాగాయి. వైఎస్సార్ హయాంలో రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఇందిరమ్మ పథకాన్ని 2006లో కపిలేశ్వరపురం మండలం పడమర ఖండ్రిక గ్రామంలో ప్రారంభించారు. అదే అనుబంధాన్ని పంచుతూ వైఎస్ జగన్ 2018 జూలైలో మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల మీదుగా పాదయాత్ర చేశారు. 2009లో చేపట్టిన ఓదార్పు యాత్ర సందర్భంగా కపిలేశ్వరపురం మండలంలోని మాచర గ్రామంలోని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సార్లు రెండు నియోజకవర్గాలను సందర్శించారు.

సంక్షేమానికి ప్రతిరూపం

వైఎస్ జగన్ పాలనలో ప్రభుత్వ లబ్ధి పొందని ఇల్లు లేదంటే అతిశయోక్తికాదు. వైఎస్ జగన్ పాలనకు ముందు రోజుల్లో పేదలకు ప్రభుత్వ స్థలాలను మాత్రమే ఇచ్చేవారు. వైఎస్ జగన్ హయాంలో ప్రైవేట్ భూములను కొని మరీ పేదలకు స్థలాలను ఇచ్చారు. మండలాలవారీగా కపిలేశ్వరపురంలో 1,753, రాయవరంలో 2,143, మండపేటలో 5,240, రామచంద్రపురంలో 6,395, కె.గంగవరంలో 2,089, కాజులూరులో 1,838 మొత్తం రెండు నియోజకవర్గాల్లో 19,458 మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఐదేళ్ళ తర్వాత క్రయ విక్రయాలు జరుపుకునే సౌకర్యంతో అక్క చెల్లెమ్మల పేరున పట్టాలనందజేయడం రాష్ట్ర చరిత్లో వైఎస్ జగన్ మాత్రమే చేశారు. మండపేట–ద్వారపూడి ఆర్‌అండ్‌బీ రహదారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే నిర్మితమైంది. తాతపూడి వద్ద బ్యాంక్ కెనాల్‌పై కాలిబాట వంతెన నిర్మితమైంది. మండపేటలో అదనపు భూమిని సేకరించి డంపింగ్ యార్డును విస్తరించి దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పారిశుధ్య సమస్యను పరిష్కరించారు.

జగన్ పాలనను జారవిడుచుకొన్నామంటూ...

ఆరు నెలల కూటమి ప్రభుత్వం పాలనా తీరును ప్రజలు సునిశితంగా పరిశీలిస్తున్నారు. కూటమి పాలనను గత ఐదేళ్ల వైఎస్ జగన్ పాలనతో పోల్చి చూసుకుంటున్నారు. జగన్ పాలనను జారవిడుచుకున్నామా అన్న మధనంలో అనేకమంది ఉన్నారని విశ్లేషకుల అంచనా. చెప్పిన మాటను చెప్పిన సమయానికి నిలబెట్టుకున్న వైఎస్ జగన్ పాలనా తీరే అందుకు కారణమంటున్నారు. వైఎస్ జగన్ రాష్ట్రంలోని రైతు కుటుంబానికి రూ.13,500 చొప్పున ఐదేళ్లలో రూ.67,500 సాయాన్ని అందజేసి నిరూపించారు. ప్రతి గ్రామంలో సచివాలయాన్ని ఏర్పాటు చేసి పది నుంచి 11 మంది వరకూ ఉద్యోగులను నియమించారు. 50 ఇళ్ళకు ఒక ప్రతినిధి తరఫున ప్రజా సంక్షేమం కోసం గౌరవ వేతనం ఇస్తూ సేవకులకు చేయూతనిచ్చారు. ప్రభుత్వ సాయాన్ని మధ్యవర్తులు ప్రమేయం లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాకు జమచేశారు. ప్రభుత్వ వైద్యులను సామాన్యుల ఇంటికి పంపి వైద్యం చేయించారు. అక్కడే మందులను ఇచ్చారు. కరోనా, వరదలు వంటి విపత్తుల సమయాల్లో సామాన్య ప్రజలకు అండగా నిలిచి పరీక్షలు చేయించారు.

వైఎస్ జగన్ మాదిరిగా పాలన చేయలేక

ఎలాగైనా గెలవాలన్న కాంక్షతో అడ్డగోలు హామీలు గుప్పించి కూటమి నేతలు అధికారంలోకి వచ్చారు. ఈ ఏడాది మార్చి 9న రామచంద్రపురం రూరల్ హసనబాదలోనూ, ఏప్రిల్ 3న ద్రాక్షారామలోనూ, జనవరి 20న మండపేట పట్టణం, ఏడిదలోనూ టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం యాత్రలో పలు హామీలను ఇచ్చారు. ఏప్రిల్ 26న ద్రాక్షారామ సభలోనూ, మే 1న మండపేట సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడుతూ కూటమి హామీలకు తాను హామీ ఇస్తున్నానంటూ గట్టిగా చెప్పారు. అధికారంలోకి వచ్చాక హామీల అమలు సంగతి ఎత్తడం లేదు. ప్రజలు తరఫున ప్రశ్నిస్తానన్న గొంతు అధికార పక్షం కావడంతో సర్దుబాటు చేసుకొంటోంది. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయకపోవడంతో రామచంద్రపురం అర్బన్, రూరల్ మండలంలో 364, కె.గంగవరం మండలంలో 265, కాజులూరు మండలంలో 278 మంది ఉపాధ్యాయులు విస్మరణకు గురయ్యారు. గౌరవ జీతాలను రూ.10 వేలకు పెంచి విధుల్లో కొనసాగిస్తామన్న హామీతో వేలాది మంది వలంటీర్లు మోసపోయారు. పాఠశాలలు తెరిచి ఆరు నెలలు కావస్తున్నా 'తల్లికి వందనం' సాయం ఇవ్వకపోవడంతో మండపేట నియోజకవర్గంలో 21,441 మంది, రామచంద్రపురం నియోజకవర్గంలో 13,690 మందిని వంచించారు. ఖరీఫ్ సాగు పూర్తయితనా 'అన్నదాతా సుఖీభవ' సాయమందక మండపేట నియోజకవర్గంలో 22,369 మంది రామచంద్రపురం నియోజకవర్గంలో 19,659 మంది రైతులు మోసపోయారు. ఇలాంటివెన్నో ఉన్నాయి.

నేడు మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు



పిల్లి సూర్యప్రకాశ్, వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్

రామచంద్రపురం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహిస్తామని, పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 9 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తామని అన్నారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

వేడుకలకు సన్నద్ధమైన కార్యకర్తలు

మండపేట, రామచంద్రపురం నియోకవర్గాల్లో సామాన్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వైఎస్ జగన్ పుట్టి నరోజు వేడుకలను జరుపుకునేందుకు సన్నద్ధమయ్యారు. పార్టీ కో ఆర్డినేటర్లు పిల్లి సూర్యప్రకాష్, తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో వేడుకలు, సేవా కార్యక్రమాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం



ప్రథమ స్థానం సాధించిన వాలీబాల్ జట్టుతో మూర్తి తదితరులు

రామచంద్రపురం: బొమ్మూరు జీఎంఆర్‌లో నిర్వహించిన పాలిటెక్నిక్ అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీల్లో స్థానిక వీఎస్ఎం పాలిటెక్నిక్ కళాశాల క్రీడాకారులు ప్రథమ స్థానం సాధించారని ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.బాలాజీ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఐపీఎస్‌జీఎం 2024 మీట్‌లో గోదావరి జిల్లాలకు చెందిన 14 జట్లు పాల్గొన్నాయని, వీఎస్ఎం క్రీడాకారులు ఫైనల్స్‌లో కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాల జట్టుతో తలపడి విజయం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ వి.రవీంద్ర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఏవివి శ్రీనివాసు, పీడీ టి.సత్తిరాజు తదితరులు క్రీడాకారులను అభినందించారు.

విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఈఈ రత్నాలరావు తదితరులు

రామచంద్రపురం: ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజన్‌లో జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం ఇంధన పొదుపుపై విద్యార్థినీ విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నాగఅభిజ్ఞ, విష్ణుప్రియ, సీహెచ్‌ఎస్‌పీ సందీప్, కార్తిక్, హర్షరాఘవన్, అంజుశ్రీ, సుధీప, దుర్గాప్రసాద్, దీవెనలు పోటీల్లో విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. ఏఈలు మేడిశెట్టి వెంకట రమణ, ఎస్కే నజీర్ ఖాన్, జేఏఓ ఏడీఎండీ శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న లారీల సీజ్



అంగర పోలీస్ స్టేషన్ వద్ద మట్టి లారీలు

కపిలేశ్వరపురం: కేదారిలంక, గ్రామ శివారు వీధివారిలంక గ్రామాల్లో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్ లారీలను శుక్రవారం సీజ్ చేసినట్టు అంగర ఎస్సై డి.రవి కుమార్ తెలిపారు. మట్టిని తరలిస్తున్నారన్న సమాచారాన్ని అందుకున్న వీఆర్వో బుజ్జిబాబు పోలీసుల దృష్టికి తీసుకెళ్ళారు. స్పందించిన పోలీసులు మట్టి లోడ్ వాహనాలను అదుపులోకి తీసుకుని అంగర పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తదుపరి చర్యలు నిమిత్తం మైనింగ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినట్టు ఎస్సై రవికుమార్ తెలిపారు.

కల్వర్టు... కలవరపాటు



రక్షణ గోడలు లేకపోవడంతో డ్రైన్‌లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్ (ఫైల్)

కాజులూరు: మండలంలోని ఉప్పుమిల్లి, దుగ్గుదుర్రు రహదారిలో డ్రైన్‌పై కల్వర్టు ప్రమాదాలకు నిలయంగా మారింది. సుమారు 15 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కల్వర్టుకు అధికారులు అప్పట్లో ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించలేదు. దీంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ కల్వర్టుకు ఇరువైపులా రోడ్డు మలుపు తిరిగి ఉంది. వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పి సరాసరి డ్రైన్‌లో పడిపోతున్నాయి. ఇటీవల ఒక ట్రాక్టరు కల్వర్టుపై నుంచి డ్రైన్‌లోకి పడిపోగా డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించటంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

అమిత్ షాను క్యాబినెట్ నుంచి తొలగించాలి



కోర్టుల ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

రామచంద్రపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను క్యాబినెట్ నుంచి వెంటనే తొలగించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన వెంకటరమణ, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బొడ్డపాటి సురేష్ కుమార్‌లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కోర్టుల ప్రాంగణంలో ఎస్సీ, బీసీ న్యాయవాదులు న్యాయ దేవత విగ్రహం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్లో ఎగతాళిగా మాట్లాడడం దారుణమన్నారు. అంబేడ్కర్‌ను అవమానించడం అంటే దేశ ప్రజలను అవమానించడమేనని అన్నారు. అమిత్ షా ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, న్యాయవాదులు గాలికి చిట్టిబాబు, కప్పల గోవిందరాజులు, రవికిరణ్, శెట్టి రామ్మూర్తి, నేలపాటి వీరభద్రరావు, దొమ్మలపాటి సత్యనారాయణ, ఇంత పూర్ణచంద్ర సుకుమారన్, సాధే నారాయణ రావు, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సేవలందించాలి



కపిలేశ్వరపురంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



రామచంద్రపురం శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ అంబటి భవాని

కపిలేశ్వరపురం: సామాన్య ప్రజా క్షేత్రంలో సకాలంలో సేవలందించాలని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధికారులకు సూచించారు. జీపీడీపీ, బీపీడీపీ కార్యక్రమాలపై ప్రజా ప్రతినిధులకు ఒక రోజు శిక్షణ తరగతిని శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. తొలుత అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాలపై ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలు అమలులో ప్రజా ప్రతినిధుల పాత్రను వివరించారు. ఎంపీడీఓ కార్యాలయ ఏవో జి.రాజేంద్రప్రసాద్, ఈఓ పీఆర్‌డీ ఆర్ఎమ్‌వీవీఎస్ ఈశ్వరరావు, టీకి పంచాయతీ కార్యదర్శి కె.రామకృష్ణ పలు అంశాలను వివరించారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు, పథకాలపై అవగాహన పెంచుకునేందుకు శిక్షణ తరగతి దోహదపడిందని ప్రజాప్రతినిధులు అన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని 25 పంచాయతీల సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు (జీపీడీపీ), మండల అభివృద్ధి ప్రణాళికలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ అంబటి భవాని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎన్.సెలత్‌రాజు, మాస్టర్ ట్రైనర్లు వలివేటి సూర్య సుబ్రహ్మణ్యం, పీఈ సుందెర్‌లాల్, పెట్టా సత్యనారాయణలు అభివృద్ధి ప్రణాళికల ఆవశ్యకత, వాటిని అమలు చేయాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. వైఎస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా (బాబ్జీ), ఎంపీటీసీ సభ్యులు పంపన ఏడుకొండలు, చిక్కాల దొరబాబు, బళ్ల సుధాకరరావు, పరమటి జ్ఞానలక్ష్మి, గుత్తుల అచ్యుతవేణి, తుమ్మూరి సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు మల్లిమొగ్గల శ్రీధర్, అయ్యల అమ్మాజీ, యల్లమిల్లి సతీష్‌కుమారి పాల్గొన్నారు.

మండపేట: గ్రామ పంచాయతీ ప్రోగ్రామింగ్ (జీపీడీపీ) ద్వారా గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మండల విస్తరణాధికారి డి.శ్రీనివాస్ అన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు జరిగాయి. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఈవోపీఆర్డీ శ్రీనివాస్ వారికి వివరించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులను ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకుని గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పసుమర్తి నాగేశ్వరరావు (నాగబాబు), గజ్జి వెంకటరమణ, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ వీఎన్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు దేవు ప్రసాద్ నాయుడు, పిల్లా అరవలక్ష్మి, సర్పంచ్‌లు వరదా చక్రవర్తి, మట్టపర్తి గోవిందరాజు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రాయవరం: సమగ్ర ప్రణాళికతోనే పంచాయతీలు, మండల పరిషత్‌లు పురోభివృద్ధి సాధిస్తాయని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి జీపీడీపీ, బీపీడీపీలపై ఒక రోజు మండలస్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాలు, మండల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలన్నారు. పంచాయతీ విస్తరణాధికారి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీ వ్యవస్థలో ప్రజాప్రతినిధుల పాత్ర చాలా కీలకమైనదన్నారు. పంచాయతీ వ్యవస్థలో ప్రజాప్రతినిధులు చేయాల్సిన పనులను తెలుసుకోవాలన్నారు. తొలుతగా మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రీసోర్స్‌పర్సన్ ఎస్.భీమేశ్వరి అభివృద్ధి ప్రణాళికల తయారీపై వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ చైతన్య కుమారి, హౌసింగ్ ఏఈఈ జీఎస్ఎన్ దాసు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ చైతన్య కుమారి, హౌసింగ్ ఏఈ జీఎస్ఎన్ దాసు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



కూళ్ల సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్

కె.గంగవరం: గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మృత్యుంజయరావు అన్నారు. శుక్రవారం కూళ్ల గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన రీ సర్వేలో వచ్చిన సమస్యలపై రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తారన్నారు. చాలా వరకూ భూ సమస్యలు పరిష్కరించామని, ఇంకా ఏమైనా ఉంటే తెలపాలన్నారు. నిర్దేశించిన సమయానికి వాటిని పరిష్కరిస్తామన్నారు. ఆర్ఐ వెంకట్రావు, సర్వేయర్ పావని తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: భూమిపై యజమానులకు శాస్త్రబద్ధమైన హక్కులు కల్పించే లక్ష్యంతో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. అంగరలో శుక్రవారం గ్రామం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూహక్కులపై తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరించమంటూ భూయాజమానుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పుత్సల శ్రీనివాస్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు ఐ.పి.శెట్టి సూచించారు. మండలంలోని వెదురుపాక, వి.సావరం, రాయవరం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రాయవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు ఐ.పి.శెట్టి మాట్లాడుతూ గ్రామాల్లో అన్నిటి కన్నా భూ సమస్యలే అధికంగా ఉంటాయన్నారు. వాటిని పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటి పరిష్కారానికి తహసీల్దారు కార్యాలయానికి రాకుండా గ్రామాల్లోనే అర్జీలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రాయవరంలో 14 మంది భూ సమస్యల పరిష్కారం కోరుతూ ఫిర్యాదులు ఇవ్వగా, 58 మంది రైతులు పాల్గొన్నారు.